ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 19 జూన్ 2024





సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పురావస్తు తవ్వకాలకు ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

కీళడి సహా 8చోట్ల పురావస్తు తవ్వకాలు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తమిళుల ప్రాచీన నాగరికత, చరిత్రను అన్వేషించే దిశగా శివగంగ జిల్లా కీళడి, కొందగై సహా ఎనిమిది ప్రాంతాల్లో పురావస్తు తవ్వకాలు ప్రారంభమయ్యాయి. చెన్నై సచివాలయంలో మంగళవారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ తవ్వకాలను ప్రారంభించారు. శివగంగ జిల్లాలోని కీళడి, దాని సమీపంలో ఉన్న కొందగైలో పదో విడత పురావస్తు తవ్వకాలను, విరుదునగర్ జిల్లా వెంబకోటలో మూడో విడత పురావస్తు తవ్వకాలను, తిరువణ్ణామలై జిల్లా కీళనమండి వద్ద రెండో విడత పురావస్తు తవ్వకాలను ఆయన ప్రారంభించారు. ఇదే విధంగా పదుకోట జిల్లా పొర్పనకోటలో రెండో విడత పురావస్తు తవ్వకాలు, తెన్‌కాశి జిల్లా తిరుమాల్‌పురం వద్ద, కృష్ణగిరి జిల్లా చెన్నానూరు వద్ద, తిరుప్పూరు జిల్లా కొంగల్‌నగరం వద్ద, కడలూరు జిల్లా మరుంగూరులో తొలి విడత పురావస్తు తవ్వకాలకు స్టాలిన్ శ్రీకారం చుట్టారు.

శిలాశాసనాలపై 28వ సంపుటి....

ఈ కార్యక్రమంలోనే పెరుంబాలై పురావస్తు పరిశోధనలపై రూపొందించిన నివేదికను, రాష్ట్ర పురావస్తు పరిశోధనశాఖ చెంగల్పట్టు జిల్లాలో బయల్పడిన 138 శిలాశాసనాల విశేషాలపై ముద్రించిన 28వ సంపుటిని కూడా స్టాలిన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, కేఆర్ పెరియకరుప్పన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, పర్యాటక, దేవాదాయ శాఖల అదనపు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ కె.మణివాసన్, పురావస్తు శాఖ ప్రధానకార్యదర్శి డి.ఉదయచంద్రన్ పాల్గొన్నారు. ఇదే విధంగా పురావస్తు తవ్వకాలు ప్రారంభమైన విరుదునగర్ జిల్లాలో ఎంపీ మాణిక్కం ఠాకూర్, శాసనసభ్యుడు ఏఆర్ఆర్ రఘురామన్, జిల్లా కలెక్టర్ పి.జయశీలన్, శివగంగ జిల్లాలో ఎంపీ కార్తీ చిదంబరం, శాసనసభ్యురాలు తమిళరసి రవికుమార్, కలెక్టర్ ఆషా అజిత్, కీళడి పురావస్తు విభాగం సంచాలకులు ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె కారణంగా కోయంబేడు వద్ద నిలిచిన ఆమ్నీ బస్సులు

ఆ బస్సులకు నో ఎంట్రీ

● రాష్ట్ర పర్మిట్ నిబంధలు పాటించని ఆమ్నీ బస్సుల సీజ్

● అమల్లోకి వచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను ఉల్లఘించి, పొరుగు రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నెంబర్లతో, ఆలిండియా పర్మిట్‌తో తిరిగే ఆమ్నీ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. ఇలాంటి ఆమ్నీ బస్సుల్లో ప్రయాణించొద్దంటూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర రవాణా సంస్థ కమిషనర్ షణ్ముగసుందరం ఓ ప్రకటన జారీ చేస్తూ... ఈ రకం ఆమ్నీ బస్సుల సంచారంపై ప్రభుత్వం విధించిన నిషేధ ఉత్తర్వులు మంగళవారం నుంచే అమల్లోకి వచ్చాయని, ప్రజలు ఆ బస్సుల్లో ప్రయాణించకపోవడం మంచిదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర రిజిస్ట్రేషన్ నెంబర్లతో 1535 ఆమ్నీ బస్సులు నడుస్తున్నాయి. ఇవి కాకుండా 943 ఆమ్నీ బస్సులు ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నెంబర్లు కలిగి ఆలిండియా టూరిస్టు పర్మిట్‌తో నిబంధనలను అతిక్రమించి నడుస్తున్నాయి. ఇలా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఆమ్నీబస్సుల కారణంగా ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఈ మేరకు ఒక్కో ఆమ్నీ బస్సువల్ల యేడాదికి రూ.4.32 లక్షల చొప్పున నష్టం వాటిల్లుతున్నట్లు షణ్ముగసుందరం తెలిపారు. అంతేకాకుండా ఆ బస్సుల యజమానులు నాగాలాండ్ సహా ఇతర రాష్ట్రాల్లో తప్పుడు దస్తావేజులు సమర్పించి ఆలిండియా టూరిస్టు పర్మిట్లు పొందుతున్నారని, ఆ పర్మిట్ నిబంధనలకు వ్యతిరేకంగానే రూట్లు వేసుకుని రాష్ట్రంలో నడుపుతున్నారని పేర్కొన్నారు. ఈ ఆమ్నీ బస్సులను క్రమబద్ధీకరించేందుకు రవాణా శాఖ అధికారులు పలు విడతలుగా వాటి యజమానులతో చర్చించారు. అంతేకాకుండా ఆ బస్సుల రిజిస్ట్రేషన్ నెంబర్లకు బదులుగా రాష్ట్రానికి చెందిన రిజిస్ట్రేషన్ నెంబర్లు పొంది నడపాలని, ఆ బస్సుల సంచారంపై అమలు చేయదలచిన నిషేధం గడువును మూడుసార్లు పొడిగించినా పట్టించుకోలేదన్నారు. ఇలా పొరుగు రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నెంబర్లతో ఆలిండియా పర్మిట్ కలిగిన బస్సులు 905 దాకా ఉండగా వాటిలో 105 బస్సులు రాష్ట్ర రిజిస్ట్రేషన్ నెంబర్లు పొంది నడుస్తున్నాయి. తక్కిన 800 ఆమ్నీ బస్సులు చట్ట వ్యతిరేకంగా నడుస్తున్నాయి. ఇలాంటి ఆమ్నీ బస్సుల్లో వెళ్లే ప్రయాణికులకు ప్రమాదాలు జరిగినా ఎలాంటి నష్టపరిహారం చెల్లించరని పేర్కొన్నారు. ఈ రకం ఆలిండియా టూరిస్టు పర్మిట్ ఆమ్నీ బస్సులను నడుపటం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి యేడాదికి రూ.34.56 కోట్ల మేరకు నష్టం వాటిల్లుతోందన్నారు. రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సులు, ఆమ్నీ బస్సుల ఛార్జీల కంటే తక్కువ ఛార్జీలతో ఈ బస్సులను నడుపుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని చెప్పారు. ఈ పరిస్థితులలో మంగళవారం నుండి పొరుగు రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నెంబర్లతో ఆలిండియా టూరిస్టు పర్మిట్‌తో నడిచే ఆమ్నీ బస్సుల సంచారంపై నిషేధం అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ ఉత్తర్వును పట్టించుకోక ఈ బస్సులను నడిపితే ఆయా ప్రాంతాలకు చెందిన రవాణా శాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటారని కూడా హెచ్చరించారు.

ఆమ్నీ బస్సుల సమ్మె...

రాష్ట్ర ప్రభుత్వ హెచ్చరికతో రాష్ట్రేతర రిజిస్ట్రేషన్ నెంబర్లతో ఆలిండియా టూరిస్టు పర్మిట్ కలిగిన ఆమ్నీ బస్సుల యజమానులు మంగళవారం మధ్యాహ్నం నుండి సమ్మెకు దిగారు. కోయంబేడు, కిలాంబాక్కం తదితర ప్రాంతాల్లో సుమారు వందకు పైగా ఆమ్నీ బస్సులను నిలిపి వేశారు.



ఓమందూర్ ఆసుపత్రి ప్రాంగణంలో కూలిన మర్రి చెట్టు



● ఓమందూర్ ఆసుపత్రిలో కూలిన 80 ఏళ్లనాటి మర్రి చెట్టు

● గంటసేపు గాల్లోనే చక్కర్లు కొట్టిన విమానాలు

ఉన్నట్టుండి కురిసిన వాన

పెరంబూర్, జూన్ 18: నగరంలో సోమవారం అర్ధరాత్రి గంట సేపు ఈదురుగాలులతో కురిసిన భారీవర్షానికి రోడ్లపై నీరు ప్రవహించింది. ఈదురుగాలులతో ఓమందూర్ వైద్యకళాశాల ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న 80 ఏళ్ల నాటి మర్రి చెట్టు కూలింది. ఆగ్నేయ అరేబియా సముద్రం, దానిని ఆనుకొని ఉన్న కేరళ తీరం వెంబడి ఆవరించిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో ఈ నెల 21వ తేది వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది. ఈ నేపథ్యంలో, నగరంలోని పలు ప్రాంతాల్లో కొద్దిరోజులుగా ఉదయం, సాయంత్రం వేళల్లో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. మంగళవారం వేకువజామున 2 గంటల ప్రాంతంలో ఓమందూర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రి ప్రాంగణంలోని బి బ్లాక్ ప్రవేశద్వారంలో సుమారు 20 అడుగుల చుట్టుకొలతతో ఉన్న మర్రిచెట్టు ఒరిగిపడింది. విరిగిపడిన చెట్టులోని ఓ భాగం ట్రిప్లికేన్ పోలీస్ స్టేషన్ ప్రహరీపై పడడంతో గోడ ధ్వంసమైంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరుగలేదు. మంగళవారం ఉదయం ప్రజాపనుల శాఖ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని చెట్టు కొమ్మలు తొలగించారు. ప్రవేశ ద్వారం వద్ద చెట్టు కూలడంతో రోగులు ఆసుపత్రిలోకి వచ్చేందుకు ఇబ్బందులు పడగా, అధికారులు మరో మార్గంలో వారిని పంపించారు.

విమానాల రాకపోకలకు అంతరాయం..

సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం వేకువ జాము వరకు కురిసిన వర్షాల కారణంగా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు గంట సేపు విమానాలు గాల్లోనే చక్కర్లు కొట్టగా, ఒక విమానాన్ని బెంగళూరు మళ్లించారు. దుబాయ్ నుంచి 262 మంది ప్రయాణికులతో వచ్చిన ఎమిరేట్స్ విమానం, దోహా నుంచి 314 మందితో వచ్చిన ఖతార్ ఎయిర్‌లైన్స్, అబుదాబి నుంచి 248 మందితో వచ్చిన ఎతియార్ట్ ఎయిర్‌లైన్స్, లండన్ నుంచి 368 మందితో వచ్చిన బ్రిటీష్ ఎయిర్‌లైన్స్, పుణె నుంచి 140 మందితో వచ్చిన ఇండిగో ఎయిర్‌లైన్స్, ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి వచ్చిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్, సింగపూర్ నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తదితర 7 విమానాలు ల్యాండింగ్‌కు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో గాల్లో చక్కర్లు కొట్టాయి. వాటిలో దుబాయ్ నుంచి వచ్చిన ఎయిరేట్స్ విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. మిగిలిన విమానాలు చాలా సేపు గాల్లోనే ఉండగా, గంట తర్వాత వాతావరణం అనుకూలించడంతో ఒకటి తర్వాత మరొకటి ల్యాండింగ్ అయ్యాయి. అలాగే, నగరం నుంచి సింగపూర్, ఫ్రాంక్‌ఫర్ట్, అబుదాబి, షార్జా, దోహా, దుబాయ్, ఢిల్లీ, అహమ్మదాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన 8 విమానాలు ఆలస్యంగా బయల్దేరాయి. బెంగళూరుకు పంపిన దుబాయ్ ఎయిరేట్స్ విమానం తిరిగి నగరానికి చేరుకొని విమానాశ్రయంలో ల్యాండింగ్ అయింది. ఈ విమానం తిరిగి తెల్లవారుజామున 4 గంటలకు దుబాయ్ బయల్దేరాల్సి ఉండగా, ఐదు గంటలు ఆలస్యంగా ఉదయం 10 గంటలకు బయల్దేరి వెళ్లింది.

రాష్ట్రంలో శాంతిభద్రతలు భేష్

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై



మాజీ హోం మంత్రి కక్కన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సెల్వపెరుందగై, కాంగ్రెస్ నేతలు

ప్యారీస్, జూన్ 18: రాష్ట్రంలో శాంతిభద్రతలు భేషుగ్గా ఉన్నాయని, పాతకక్షల కారణంగా జరిగే హత్యలను ప్రభుత్వం, పోలీసు శాఖ ఎలా అడ్డుకుంటుందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై పేర్కొన్నారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో మంగళవారం ఉదయం మాజీ హోం మంత్రి కక్కన్ 117వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సెల్వపెరుందగై, మాజీ ఎంపీలు కృష్ణస్వామి, కేవీ తంగబాలు, ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్, ఎంపీ తిరునావుక్కరసర్, టీఎన్‌సీసీ ఉపాధ్యక్షులు ఇమయాకక్కన్, ప్రధాన కార్యదర్శి రంగభాష్యం, ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంజన్‌కుమార్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామన్, మన్సూర్ అలిఖాన్ తదితర కాంగ్రెస్ శ్రేణులు కక్కన్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గానికి జూలై 10న జరుగనున్న ఉప ఎన్నికపై సెల్వపెరుందగై అధ్యక్షతన పార్టీ సీనియర్లు, ఎన్నికల ఇన్‌ఛార్జీలు సమావేశమై చర్చించారు. ఈ సమావేశం అనంతరం సెల్వపెరుందగై మీడియాతో మాట్లాడుతూ... కేంద్రంలో మూడో సారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోరమాండల్ రైలు ప్రమాదం సహా పలు రైలు ప్రమాదాలు సీరియల్లా కొనసాగుతున్నాయన్నారు. అయినా కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ వాటి గురించి పట్టించుకోవడం లేదని, రైల్వే శాఖకు మంజూరు చేసే నిధులతో కవచ్ వంటి భద్రత వ్యవస్థ కోసం వినియోగించకుండా టూరిస్ట్ బంగ్లా తదితరాల కోసం వినియోగిస్తున్నారని కాగ్ నివేదిక వెల్లడించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం చేపడుతున్న చర్యల కారణంగా రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఎలాంటి అంతరాయం లేదన్నారు. సొంత కారణాల కోసం ఇళ్లలో జరిగే హత్యలను ప్రభుత్వం, పోలీసు శాఖ ఎలా అడ్డుకోగలుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆస్తుల గొడవ, భార్యాభర్తల మధ్య విభేధాలు, కులాంతర వివాహాల వల్ల జరిగే పరువు హత్యలను అడ్డుకోవడం సాధ్యం కాదని.. అయినప్పటికీ, కిరాయి ముఠాల ఆగడాలను ఉక్కుపాదంతో అణిచివేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక టి.నగర్ నుంచి సీఐటీ నగర్ వరకు ఉన్న ఫ్లై ఓవర్‌కు స్వాతంత్ర్య సమర యోధుల ఫ్లై ఓవర్ అని నామకరణం చేయాలని రాష్ట్రప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. ఈ నెల 22న విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ నిర్వాహకుల సమావేశం జరుగుతుందని, ఇక్కడ జరిగే ఉప ఎన్నికలో డీఎంకే అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించేలా ఇంటింటికీ వెళ్లి ప్రచారంలో పాల్గొననున్నట్లు తెలిపారు.

తిరువణ్ణామలైలో పెరుగుతున్న డ్రగ్ సంస్కృతి!



● సన్యాసుల ముసుగులో సంఘ విద్రోహశక్తులు

● డ్రగ్స్ వేడుక నిర్వహణకు యత్నాలు

● భగ్నం చేసిన పోలీసులు

అడయార్, జూన్ 18: ప్రసిద్ధ తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి పుణ్యక్షేత్రంలో మాదకద్రవ్యాల వినియోగ సంస్కృతి నానాటికీ పెరిగిపోతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పుణ్యక్షేత్రానికి దేశం నుంచే కాకుండా, విదేశాల నుంచి భక్తులు కూడా వచ్చి గిరిప్రదక్షిణ చేస్తుంటారు. కొందరు సంఘ విద్రోహశక్తులు సన్యాసుల పేరుతో ఇక్కడ తిష్ట వేసి, గిరివలయం చుట్టూ మాదకద్రవ్యాల వినియోగానికి పాల్పడుతున్నట్టు సమాచారం. ఇలాంటి వారంతా కలిసి 'అయాహువాస్క' పేరుతో (ఇది ఒక రకమైన డ్రగ్) ఒక మాదకద్రవ్య సదస్సును నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. అయాహువాస్క పేరుతో ఒక ఆధ్యాత్మిక వేడుకగా కొన్ని గిరిజన తెగలకు చెందిన ప్రజలు జరుపుకుంటారు. ముఖ్యంగా అమెజాన్ అడవులు, దక్షిణాఫ్రికాలోని కొన్ని గిరిజన ప్రాంతాల్లో ఈ వేడుకలను ఎంతో గొప్పగా నిర్వహిస్తారు. అయాహువాస్క అనేది ఒక రకమైన వనమూలికా మొక్క నుంచి తయారు చేసే కషాయంతో కూడిన మద్యపానం. మానసిక రోగులను నయం చేసేందుకు, ఆధ్యాత్మికపరంగా లీనమయ్యేందుకు దీన్ని ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం ఇది ఒక మత్తుపదార్థంగా వినియోగిస్తున్నారు. దీన్ని మన దేశంలో నిషేధిత మత్తుపదార్థాల జాబితాలో చేర్చారు. ఈ నేపథ్యంలో తిరువణ్ణామలై పుణ్యక్షేత్రంలో 15వ తేదీ నుంచి రెండు రోజుల పాటు అయాహువాస్క వేడుకను నిర్వహించాలని కొందరు భావించారు. దీనిపై సమాచారం తెలుసుకున్న కేంద్ర మాదకద్రవ్య నిరోధక విభాగం పోలీసులు రంగంలోకి దిగి ఈ వేడుకను అడ్డుకున్నారు. ఈ వేడుకను నిర్వహించేందుకు సిద్ధపడిన మహిళ, పురుషుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విచారణలో వారు వెల్లడించిన విషయాలు విని అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు.కొన్ని ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రాలు, పర్యాటక స్థలాల్లో ఆయాహువాస్క వేడుకను విజయవంతంగా నిర్వహించామని, ఇపుడు తిరువణ్ణామలైలో నిర్వహించేందుకు చేసిన ప్లాన్ విఫలమైందని తెలిపారు.

కప్ప విషంతో ...

కప్ప విషం నుంచి తయారు చేసిన డ్రగ్‌ను ఈ వేడుకలో ఉపయోగిస్తామని వారు చెప్పినట్లు తెలిసింది. 20 నుంచి 35 యేళ్ళ వయసున్న యువతీ యువకులను లక్ష్యంగా చేసుకుని, వారి శరీరంలోకి చిన్నపాటి రంధ్రం ద్వారా ఈ విషాన్ని ఎక్కించడం లేదా పానీయంలో కలిసి ఇస్తారని పేర్కొన్నారు. మత్తు తీవ్రస్థాయికి చేరిన తర్వాత ఆరు గంటల పాటు నియంత్రణ లేకుండా ఉంటారని తెలిపారు. ఇందుకోసం ఒక వ్యక్తి నుంచి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తారని వారు వెల్లడించారు. వారు రిషికేష్‌కు చెందిన వారు కాగా, వారి నుంచి అయాహువాస్కతో పాటు మేజిక్ మష్రూమ్, కంబో అనే కప్ప విషాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే, మానసికరోగులకు ఉపయోగించే 239 గ్రాముల రసాయన పదార్థాన్ని కూడా కలిగివున్నట్లు గుర్తించారు. గత కొన్ని నెలలుగా గిరివలయం మార్గంలో ఈ డ్రగ్ సంస్కృతి పెరిగిపోతుందని, దీనిపై పోలీస్ యంత్రాంగం దృష్టిసారించి, ఈ సంస్కృతికి చెక్ పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై సమీక్ష

నేడు బీజేపీ నేతల భేటీ



చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పరాజయంపై సమీక్షించుకునేందుకు కాషాయ దళాధిపతులు సిద్ధమయ్యారు. పకడ్బందీ వ్యూహరచన చేసినా, పీఎంకే వంటి ఓటు బ్యాంక్ కలిగిన పార్టీతో పొత్తు పెట్టుకున్నా ఓడిపోవటానికి గల కారణాలను విశ్లేషించే దిశగా ఆ పార్టీ రాష్ట్ర శాఖ సమావేశం బుధవారం జరగనుంది. ఈ ఎన్నికల్లో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, రామ్ శీనివాసన్, పొన్ రాధాకృష్ణన్, నయినార్ నాగేంద్రన్, పొన్‌బాలగణపతి వంటి హేమాహేమీల్లాంటి అభ్యర్థులను బరిలోకి దింపినా వీరిలో ఒక్కరు కూడా విజయపతాకాన్ని ఎగురవేయలేకపోయారు. వీరి ఓటమికి ఎదురైన కారణాలేమిటన్న ప్రశ్నే పార్టీ నేతలను తొలుస్తోంది. ఈ పరిస్థితుల్లోనే బుధవారం ఉదయం స్థానిక టి.నగర్‌లోని కమలాలయంలో బీజేపీ రాష్ట్ర కేంద్ర కమిటీ సభ్యుల సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అన్నామలై అధ్యక్షత వహిస్తారు. కేంద్ర మంత్రి ఎల్ మురుగన్, కేశవ వినాయగం, పొన్ రాధాకృష్ణన్, వానతి శ్రీనివాసన్, హెచ్ రాజా, నయినార్ నాగేంద్రన్ ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో ఓటమిపై సమగ్రంగా సమీక్ష జరుపనున్నారు. అదే సమయంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై తీసుకోవాల్సిన నిర్ణయాలు గురించి కూడా చర్చలు జరుపనున్నారు.

అన్నామలై బెస్ట్: కేంద్రమంత్రి మురుగన్

లోక్‌సభ ఎన్నికల్లో పాలక పక్షానికి, ప్రధాన ప్రతిపక్షానికి దీటుగానే బీజేపీ పోటీ చేసిందని, ఫలితాలు ప్రతికూలంగా వచ్చినా సంతృప్తికరమైన ఓటు బ్యాంక్ లభించిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. మంగళవారం ఉదయం మీనంబాక్కం విమానాశ్రయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ పురోగతిని ప్రజలంతా ఆసక్తిగా గమనిస్తున్నారని చెప్పారు. బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అన్నామలై సమర్థవంతమైన నాయకుడని, పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పాటుపడుతున్నారని ఆయన కితాబునిచ్చారు. వయనాడు నియోజకవర్గంలో రాహుల్ సోదరి ప్రియాంకను పోటీకి దింపటం కుటుంబ వారసత్వ రాజకీయాలకు ప్రత్యక్ష నిదర్శనమని, ఆ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు పార్టీలో ఇతరులెవరూ లేరా అని ప్రశ్నించారు. రైలు ప్రమాదాలను ఎవరూ తప్పించలేరని, రైల్వే శాఖమంత్రి ప్రమాద స్థలానికి వెళ్ళి సహాయక చర్యలు చేపడుతున్నారని మురుగన్ చెప్పారు.

సమాచార దర్శిని

నిరంతరాయంగా కందిపప్పు, పామాయిల్ పంపిణీ

ఐసిఎఫ్, జూన్ 18: రేషన్ దుకాణాల్లో కందిపప్పు, పామాయిల్ నిరంతరాయంగా పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ దుకాణాల్లో మే నెలలో అందజేయాల్సిన కందిపప్పు, పామాయిల్ ఇప్పటివరకు పంపిణీ కాని నేథ్యంలో జూన్‌లో నైనా సరుకులు అందజేస్తారా అని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో, మే నెల సరుకులు కూడా జూన్‌లో పొంద వచ్చని ఆహార వస్తువుల వినియోగ సంస్థ తెలిపింది.

21న ప్రైవేట్ జాబ్ మేళా

వేలూరు, జూన్ 18: జిల్లా ఉద్యోగ అవకాశాలు, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21న ప్రైవేటు జాబ్ మేళా జరగనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి విడుదల చేసిన ప్రకటనలో... ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరానికి 10, 12 తరగతులు ఉత్తీర్ణులైన వారు, డిప్లొమా పూర్తిచేసిన వారు పాల్గొనవచ్చన్నారు. ఈ శిబిరంలో 40కి పైగా ప్రైవేటు కంపెనీలు పాల్గొని తమకు అవసరమైన ఉద్యోగులను ఎంపిక చేసుకుంటారని కలెక్టర్ తెలిపారు.

ప్రైవేట్ పాల ప్యాకెట్ల ధర తగ్గింపు

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విక్రయాలు తగ్గడంతో రెండు ప్రైవేటు సంస్థలకు చెందిన పాల ప్యాకెట్ల ధరలు తగ్గాయి. ఆ మేరకు హట్సన్ సంస్థ, ఆరోగ్యా సంస్థ పాల ధరను లీటర్‌కు రూ.2 వరకూ తగ్గించాయి. ఫుల్‌క్రీమ్ లీటర్ పాల ధరను రూ.68ల నుండి రూ.66లకు, అర్ధలీటర్ పాల ధరను రూ.37ల నుండి రూ.36లకు తగ్గించాయి. ఇదే విధంగా లీటర్ పెరుగు ధరను నాలుగు రూపాయల దాకా తగ్గించాయి. లీటర్ పెరుగు ధరను రూ.71ల నుండి రూ.67లకు తగ్గించారు.

మినీ బస్సు సేవల విస్తరణ

ఐసిఎఫ్, జూన్ 18: రాష్ట్రవ్యాప్తంగా మినీ బస్సు సేవలు విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. చెన్నై మినహా నగరాలు, గ్రామాలు అనుసంధానం చేసేలా ప్రస్తుతం 2,875 మినీ బస్సులు నడుస్తున్నాయి. ప్రస్తుతం 20 కి.మీ పరిధిలోనే ఈ బస్సు సేవలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో కొత్త మార్గాల్లో 16 కి.మీ దూరం నడిపేందుకు చర్యలు చేపట్టారు. అదే సమయంలో స్థానిక తిరువొత్తియూర్, మనలి, మాధవరం, అంబత్తూర్, వలసరవాక్కం, ఆలందూర్, పెరుంగుడి, షోళింగనల్లూర్ మండలాల్లో ఈ బస్సులు నడపడంపై అధికారులు సర్వే చేస్తున్నారు. ఈ మార్గాల్లో మినీ బస్సు సర్వీసులకు సంబంధించి ఈ నెల 14 నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. జూలై 22వ తేది ఉదయం 10 గంటలకు ఈ బస్సు సేవల విస్తరణకు సంబంధించి సమావేశం నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

యూట్యూబ్ ఛానల్ ప్రారంభించిన మాజీ మంత్రి వీరమణి


ఛానల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి వీరమణి

వేలూరు, జూన్ 18: జేకే న్యూస్ యూ ట్యూబ్ ఛానల్‌ను అన్నాడీఎంకే మాజీ మంత్రి వీరమణి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నాడీఎంకే నేతలు వేల్ అయగన్, అప్పు, జగదీశన్ సహా పలువురు కార్యకర్తలు, యూట్యూబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నారాయణి విద్యాశ్రమంలో ఉన్నత తరగతుల విభాగం ప్రారంభం


ఉన్నతస్థాయి తరగతుల విభాగం ప్రారంభోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి సెందిల్‌కుమార్, శక్తి అమ్మ

వేలూరు, జూన్ 18: స్థానిక అరియూర్ నారాయణి విద్యాశ్రమ పాఠశాలలో మంగళవారం ఉన్నత స్థాయి తరగతుల విభాగాన్ని తిరుమలైకోడి శ్రీపురం శక్తి అమ్మ అధ్యక్షతన ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయమూర్తి సెందిల్‌కుమార్ రిబ్బన్ కత్తిరించి ఈ విభాగాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బాగంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, షీల్డులు, బంగారు నాణేలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో శ్రీపురం స్వర్ణాలయం ట్రస్టీ, డైరెక్టర్ డాక్టర్ సురేష్ బాబు, స్పార్క్ మెట్రిక్ పాఠశాల కరస్పాండెంట్ సౌందర రాజన్, నారాయణి పీఠం మేనేజర్ సంపత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళాశాల విద్యా జాయింట్ డైరెక్టర్‌గా మలర్

వేలూరు, జూన్ 18: స్థానిక సిల్క్ మిల్ ప్రాంతంలో వేలూరు మండల కళాశాల జాయింట్ డైరెక్టర్ కార్యాలయం పనిచేస్తోంది. ఈ కార్యాలయ పరిధిలో వేలూరు, తిరువణ్ణామలై, తిరుప్పూర్, రాణిపేట సహా 10 జిల్లాలకు చెందిన 113 ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలున్నాయి. ఈ కార్యాలయ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎయిలన్ గత నెలాఖరులో పదవీవిరమణ పొందారు. దీంతో, స్థానిక ముత్తురంగం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ మలర్‌ను జాయిట్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు కల్పించారు. మంగళవారం మలర్ బాధ్యతలు స్వీకరించగా, కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదంలో హెచ్‌ఎం మృతి


జనువా ఎవాంజలిన్ (ఫైల్ ఫొటో)

ఐసిఎఫ్, జూన్ 18: రామనాథపురం తిరుచ్చులి సమీపంలో జరిగిన ప్రమాదంలో ప్రధానోపాధ్యాయురాలు మృతిచెందారు. మదురై తిరునగర్‌లో నివసిస్తున్న జనువా ఎవాంజలిన్ మదురై అమెరికన్ కళాశాల మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు. ఆదివారం రాత్రి సొంత ఊరైన రామనాథపురం జిల్లా నెరిపయూర్‌కు కుటుంబసమేతంగా వెళ్లారు. సోమవారం ఇంటికి తిరిగొస్తుండగా మధ్యాహ్నం 2.30 గంటలకు తిరుచ్చులి ప్రాంతంలో కారు టైర్ పేలింది. అదుపుతప్పిన కారు దగ్గరలో ఉన్న పల్లంలో బోల్తాపడడంతో, జనువా ఎవాంజిలిన్ మృతిచెందగా, ఆమె భర్త సహా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి

● దిండుగల్‌లో కాంగ్రెస్ రైలు రోకో యత్నం

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్‌లో జరిగిన రైలు ప్రమాదానికి బాధ్యత వహించి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఉదయం దిండుగల్ రైల్వేస్టేషన్ వద్ద జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రైలురోకో నిర్వహించేందుకు ప్రయత్నించారు. ఈ ఆందోళనకు జిల్లా అధ్యక్షుడు దురై మణికంఠన్ నాయకత్వం వహించారు. సుమారు వందమంది దాకా కార్యకర్తలు రైలురోకో నిర్వహించేందుకుగాను రైల్వేస్టేషన్‌లో చొరబడేందుకు ప్రయత్నించారు. అప్పటికే సిద్ధంగా ఉన్న రైల్వే పోలీసులు, స్థానిక పోలీసులు ఇనుప బారికేడ్లను పెట్టి వారిని అడ్డుకున్నారు. ఈ ఆందోళనలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేంగై రాజా, జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహ్మాన్, కౌన్సిలర్ భారతి తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

లారీ ఢీకొని రాజీవ్ విగ్రహం ధ్వంసం


లారీ ఢీకొనడంతో నేలపై పడి ఉన్న రాజీవ్ విగ్రహం

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా ఆరల్‌వాయ్‌మొళి సమీపం లాయంవిళక్కు ప్రాంతంలో సోమవారం రాత్రి అదుపుతప్పిన లారీ ఢీకొని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం ధ్వంసమైంది. 1992లో అప్పటి కాంగ్రెస్ నేత మూపనార్ ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. రాజీవ్ వర్ధంతి, జయంతి సందర్భాలలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆ విగ్రహం ధ్వంసమై నేలపై పడి ఉండటం చూసి స్థానికులు దిగ్భ్రాంతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. తొలుత దుండగులెవరో ఆ విగ్రహాన్ని పగులగొట్టి ఉంటారని అనుమానించారు. పోలీసులు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన వీడియో దృశ్యాలను పరిశీలించినప్పుడు సోమవారం రాత్రి 11.45 గంటల ప్రాంతంలో వేగంగా వచ్చిన ఓ లారీ రాజీవ్ విగ్రహాన్ని, పక్కనే ఉన్న టీషాపును ఢీకొట్టి ఆగకుండా వెళ్ళిపోతుండటం గమనించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ లారీ ఆచూకీని కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

గేదె పొడిచి మహిళకు గాయం

స్థానికుల ఆందోళన

అడయార్, జూన్ 18: స్థానిక తిరువొత్తియూరులో రోడ్డుపై నడిచి వెళుతున్న ఓ మహిళను గేదె పొడవడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో స్థానికులు ఆ యువతిని ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. తిరువొట్రియూరు గ్రామ వీధిలో గేదెల సంచారం అధికంగా ఉంది. వీటిలో గేదె పరుగెత్తుకుంటూ వచ్చి మధుమతి (33) అనే మహిళను పొడడంతో ఆమె గాయపడింది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేషన్ అధికారులు ఆ గేదెను అదుపులోకి తీసుకుని, పశువైద్య అధికారులకు అప్పగించారు. ఆ గేదెను ఏదైని పిచ్చికుక్క కరిచిందా అని పరీక్షిస్తున్నారు. అయితే, స్థానికులు మాత్రం తమ ప్రాంతంలో గేదెల సంచారాన్ని అడ్డుకోవాలని కోరుతూ స్థానిక కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. అలాగే, పోలీసులు కూడా ఆ గేదె యజమానిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

1,117 పశువుల స్వాధీనం

ఐసిఎఫ్, జూన్ 18: నగరంలో 1,117 పశువులను బంధించినట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు. రోడ్లపై సంచరించే పశువులను పట్టి వాటి యజమానులకు కార్పొరేషన్ జరిమానా విధిస్తోంది. ఈ నేపథ్యంలో, స్థానిక తిరువొత్తియూర్‌లో ఆదివారం గేదె పొడవడంతో ఓ మహిళ సహా ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో కార్పొరేషన్ ఉత్తర్వుల మేరకు సిబ్బంది ఆ గేదెను బంధించి తీసుకెళ్లారు. ఇప్పటివరకు దాని కోసం ఎవరూ రాలేదని అధికారులు తెలిపారు. ఈ ఏడాది కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాల్లో రోడ్లపై సంచరించిన 1,117 పశువులను బంధించి, వాటి యజమానులను జరిమానా విధించామని అధికారులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో అన్నాడీఎంకే నాయకుడి మృతి

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారిలో అన్నాడీఎంకే నాయకులు అనుమానాస్పదంగా మృతిచెందాడు. దివ్యాంగుడిగా ఉన్న ఆయన అవివాహితుడు.అన్నాడీఎంకే స్థానికశాఖ నాయకుడు శేఖర్(58) రెండు రోజులకు ముందు ఓరాత్రి ఇంటికి వెళ్ళారు.ఆతర్వాత ఆయనను ఎవరూ చూడలేదు. ఆయన ఇంటి తలుపులు కూడా తెరచుకోలేదు. దీనితో ఆయన బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి శేఖర్ ఇంటి వద్దకు వెళ్ళి తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్ళి పరిశీలించగా పడగదిలో ఆయన శవంగా పడి ఉండటం చూశారు.వెంటనే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనంచేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆచ్చారిపల్లం ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తిరుముల్లైవాయల్‌లో రౌడీ హత్య

● ఐదుగురి అరెస్టు

అడయార్, జూన్ 18: నగర శివారు ప్రాంతమైన తిరుముల్లైవాయల్ ప్రాంతంలో ఓ రౌడీ దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో బిగ్గరగా శబ్దం చేయడాన్ని ఖండిచడంతో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ కారణంగా తిరువేర్కాడు గోలడి ప్రాంతానికి చెందిన గణేష్ (24) అనే రౌడీని మరో గ్రూపు రౌడీలు దాడిచేసి తీవ్రంగా గాయపరచడంతో మృతి చెందాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, అన్నా నగర్ ఏరికరై ప్రాంతానికి చెందిన కార్తికేయన్, అన్భళగన్, వేలు, సెల్వం , బాలకృష్ణన్‌ను అరెస్టు చేశారు. ఈ గ్రూపు తగాదాలో గాయపడిన మరో సెల్వం, పీటర్‌ను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఆలయ పూజారికి బెయిల్ మంజూరు

అడయార్, జూన్ 18: ఆలయానికి వచ్చిన మహిళా భక్తులను లైంగికంగా వేధించిన కేసులో అరెస్టు అయిన స్థానిక కాళికాంబాల్ ఆలయ పూజారి కార్తీక్ మునుస్వామికి మద్రాస్ హైకోర్టు బెయిల్‌ను మంజూరు చేసింది. సాలిగ్రామానికి చెందిన ఓ మహిళా భక్తురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... ఆలయ పూజారి కార్తీక్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది.

విక్రవాండి ఉపఎన్నికలో ఏ పార్టీకి మద్దతు లేదు

● తమిళగ వెట్రి కళగం

పెరంబూర్, జూన్ 18: విక్రవాండి ఉప ఎన్నికలో ఏ పార్టీకి మద్దతు ఇవ్వడం లేదని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రకటించింది. ఈ మేరకు టీవీకే ప్రధాన కార్యదర్శి ఎన్.ఆనంద్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. టీవీకే అధ్యక్షుడు, నటుడు విజయ్ ఫిబ్రవరి 2వ తేది రాజకీయ పార్టీ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన పార్టీ సిద్ధాంతాలు, అజెండా, లక్ష్యం తదితరాలను త్వరలో నిర్వహించనున్న పార్టీ తొలి మహానాడులో ప్రకటించనున్నారు. ఇప్పటికే పార్టీ అనుబంధ విభాగాలు ప్రారంభించడం, ఈ విభాగాలకు నేతల ఎంపిక, సభ్యత్వం, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం చేసే చర్యలు చేపట్టిన విజయ్, 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేపట్టాలా వ్యూహరచన చేస్తున్నారు. పార్టీ అంతర్గత పనుల్లో భాగంగా ఇటీవల జరిగిన స్థానిక సంస్థలు సహా ఎలాంటి ఎన్నికల్లోనూ ఆ పార్టీ పోటీ చేయలేదు. ఈ నేపథ్యంలో, జూలై 10వ తేది జరగనున్న విక్రవాండి శాసనసభ ఉపఎన్నికలో తాము పోటీ చేయడం లేదని, అలాగే, ఏ పార్టీకి మద్దతు ప్రకటించడం లేదని పార్టీ అధ్యక్షుడు నిర్ణయించినట్లు టీవీకే ప్రకటించింది.

ఉపఎన్నికలో 'మామిడి పండు' చిహ్నం

● ఈసీకి పీఎంకే లేఖ

పెరంబూర్, జూన్ 18: విక్రవాండి శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నిక జూలై 10వ తేది జరగనుంది. ఎన్నికకు సంబంధించిన నామినేషన్ దాఖలు ప్రక్రియ జరుగుతోంది. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరఫున పీఎంకే అభ్యర్థిగా సి.అన్బుమణి బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, విక్రవాండి ఉప ఎన్నికలో తమకు 'మామిడి పండు' చిహ్నం కేటాయించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పీఎంకే లేఖ రాసింది. గతంలో జరిగిన పలు ఎన్నికల్లో తాము మామిడి పండు గుర్తుపై పోటీ చేశామని, ప్రస్తుత ఉపఎన్నికలోనూ తమకు అదే గుర్తు కేటాయించాలని పీఎంకే లేఖలో పేర్కొంది. కాగా, ఇటీవల ముగిసిన పార్లమెంటు ఎన్నికల్లో 4.23 శాతం ఓట్లు పొంది ప్రాంతీయ పార్టీ హోదాను పీఎంకే కోల్పోయిన విషయం తెలిసిందే.

విక్రవాండి ఉపఎన్నికలో పీఎంకేకు డిపాజిట్ గల్లంతు

● మంత్రి పొన్ముడి జోస్యం

అడయార్, జూన్ 18: విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికలో పోటీ చేయాలని భావించిన పీఎంకే అభ్యర్థికి డిపాజిట్లు గల్లతవడం తథ్యమని రాష్ట్ర మంత్రి పొన్ముడి జోస్యం చెప్పారు. ఇటీవల నియోజకవర్గ పరిధిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ధరావతులు కోల్పోయిన పీఎంకే.. ఈ ఉపఎన్నికలో కూడా డిపాజిట్ గల్లంతు కావాలని, ఆ దిశగా పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా నీట్ రద్దు చేయాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయన్నారు. కానీ ఎన్డీయే కూటమిలో భాగస్వామిగా ఉన్న పీఎంకే.. ఈ పరీక్షల రద్దుకు ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి చేయకుండా లేఖ రాసి చేతులు దులుపుకోవడం ప్రజలను మోసం చేయడమేనని పేర్కొన్నారు.

ఎలైట్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం


సమావేశంలో పాల్గొన్న సభ్యులు

వేలూరు, జూన్ 18: చెన్నై అన్నానగర్ వెస్ట్ తమిళనాడు హౌసింగ్ బోర్డు పథకంలో జరుగుతున్న ఎలైట్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ తొలి వార్షిక జనరల్ కమిటీ సమావేశం జరిగింది. సంఘ అధ్యక్షుడు శరవణన్ ఆహ్వానం పలికి, అసోసియేన్ పనితీరును వివరించారు. కార్యక్రమానికి సంఘ సెక్రటరీ దినకరన్ అధ్యక్షత వహించగా, కోశాధికారి నిధుల వివరాలతో పాటు డ్రైనేజీ వల్ల తలెత్తే సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను వివరించారు. అనంతరం సంఘ సభ్యుల నుంచి నెలకు రూ.500 వసూలుచేసి, ఈ నిధులతో సీసీ కెమెరాలు, నేమ్ బోర్డు, ప్రకటనలు తదితరాలు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో ఉప సెక్రటరీ మోతిసింగ్, సంఘ సభ్యులు నరసింహన్, విజయన్, విజయ్ తదితరులు పాల్గొనగా, ఉపాధ్యక్షుడు సెంథిల్‌కుమార్ వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

హోటల్‌లో కొనుగోలు చేసిన ఆహారంలో బల్లి

ఐసిఎఫ్, జూన్ 18: ఓ హోటల్‌లో కొనుగోలు చేసిన ఆహారంలో బల్లి ఉండడంపై వినియోగదారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కన్నియాకుమారి జిల్లా మార్తాండం పాత థియేటల్ వద్ద ఉన్న ఓ హోటల్‌లో పోలీసు అధికారి కుమారుడు రోహిత్ బీఫ్ ఫ్రై కొనుగోలు చేశారు. ఇంటికొచ్చి పార్శిల్ తెరచిచూడగా, తోక తెగిన బల్లి ఉండడాన్ని గుర్తించి దిగ్భ్రాంతి చెందారు. ఈ విషయమై మార్తాడం పోలీస్‌స్టేషన్‌లో రోహిత్ ఫిర్యాదు చేశారు. ఆహార పొట్లాన్ని పోలీసులు ఆహార భద్రతా శాఖ అధికారులు పంపగా, అధికారులు పరిశోధనకు తీసుకెళ్లారు. పరిశోధన అనంతరం వివరాలు తెలియజేస్తామని అధికారులు తెలిపారు. ఇదివరకు జిల్లాలో కనున కొట్టి హోటళ్లలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం.

జాతీయ రహదారిపై స్కేటింగ్

● శిక్షణ పాఠశాల నిర్వాహకుడిపై కేసు

పెరంబూర్, జూన్ 18: సేలం జిల్లా సీలనాయకన్‌పట్టి నుంచి మేలూరు వెళ్లే జాతీయ రహదారిలో బాలిబాలికలు స్కేటింగ్‌గా వెళ్లారు. లారీలు, కార్లు తదితర వాహనాల మధ్య బాలిబాలికలు ప్రమాదకరంగా స్కేటింగ్ వెళ్లడం గమనించిన పలువురు ఆందోళనకు గురయ్యారు. తగిన అనుమతులు లేకుండా పిల్లలను ఈ స్కేటింగ్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఈ స్కేటింగ్ నిర్వహించడంపై స్థానిక పోలీసులు, శిక్షణా పాఠశాల నిర్వాహకుడిపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

పుళల్‌లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

● ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, జూన్ 18: స్థానిక పుళల్ బాలాజీ నగర్ వెజిటేరియన్ కాలనీలో క్రికెట్ ఆడుతూ రెండు జట్ల మధ్య చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి పోలీసులు ముగ్గుర్ని అరెస్ట్ చేశారు. వెజిటేరియన్ కాలనీలో ఉన్న మైదానంలో క్రికెట్ ఆడేందుకు మాధవరానికి చెందిన సతీష్‌కుమార్, జస్టిన్‌థామస్, కార్తికేయన్‌తో కూడిన జట్టు వెళ్లింది. పుళల్ కదిర్‌వేడు ప్రాంతానికి చెందిన కామేశ్వరన్, రాహుల్, ఇన్బరసు, ముఖిల్‌అరసన్ జట్టు కూడా వెళ్లింది. అప్పుడు రెండు జట్ల మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం చివరకు ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు క్రికెట్ బ్యాట్లతో దాడికి దిగడంతో ఆరుగురికి పైగా గాయాలయ్యాయి. దీనిపై అందిన సమాచారంతో అక్కడకు చేరుకున్న పుళల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాజాసింగ్, కార్తికేయన్ జట్టుకు చెందిన ముగ్గుర్ని అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి మరో ఐదుగురి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెరీనా బీచ్‌లో జాలరి అనుమానాస్పద మృతి

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయోధ్యకుప్పానికి చెందిన జాలరి కార్తవరాయన్ (55) మెరీనాబీచ్‌లో చిన్న గుడిసెలో అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. సోమవారం రాత్రి ఆయన గుడిసెలో పడుకున్నారు. మంగళవారం ఉదయం మణిమారన్ అనే వ్యక్తి గుడిసెలో కార్తవరాయన్ విగత జీవియైపడి ఉండటం చూసి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కార్తవరాయన్ ఒంటిపై సిగరెట్ ముక్కతో కాల్చిన గాయాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురు తమిళ జాలర్ల అరెస్ట్

పెరంబూర్, జూన్ 18: సరిహద్దులు దాటి చేపల వేట సాగిస్తున్నారంటూ పుదుకోట జిల్లా కోట పట్టణానికి చెందిన నలుగురు జాలర్లను శ్రీలంక నావికాదళం మంగళవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసింది. కోటపట్టణానికి చెందిన జాలర్లు 214 మరపడవల్లో సోమవారం చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. వారిలో సిబిరాజ్‌కు సొంతమైన పడవలో పార్తిబన్, మురళి, సారథి, రామదాస్ తదితరులు మంగళవారం తెల్లవారుజామున నడుదీవి ప్రాంతం లో చేపల వేట సాగిస్తుండగా, వారిని చుట్టుముట్టిన శ్రీలంక నావికాళం సరిహద్దులు దాటారంటూ అరెస్ట్ చేసి కాంగేశన్ హార్బర్‌కు తరలించి విచారిస్తున్నారు.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా


కవిన్ సిద్ధార్థ్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, జూన్ 18: గూడ్సు రైలు పైకెక్కి సెల్ఫీ తీసుకోబోయిన యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన స్థానిక కొరుక్కుపేటలో చోటుచేసుకుంది. తిరువొత్తియూర్‌కు చెందిన కవిన్ సిద్ధార్థ్ తన స్నేహితులతో కొరుక్కుపేట రైల్వే యార్డుకు వెళ్లాడు. అక్కడ ఆగి ఉన్న గూడ్సు రైలు బోగీపై ఎక్కి సెల్ఫీ తీసుకుంటున్న సమయంలో కవిన్ చేయి హై టెన్షన్ విద్యుత్ వైర్లకు తగడంలో విద్యుదాఘాతానికి గురై సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


ఇయావుద్దీన్ (ఫైల్ ఫొటో)

పెరంబూర్, జూన్ 18: బక్రీద్ పండుగ జరుపుకొని దుబాయ్ వెళ్లే సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి సహా ఇద్దరు మృతిచెందారు. దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్న మైలాడుదురై జిల్లా ఆనైమలనల్లూర్‌కు చెందిన ఇయావుద్దీన్ బక్రీద్ పండుగ కోసం 15 రోజుల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. పండుగ ముగించుకొని దుబాయ్ వెళ్లేందుకు చెన్నై విమానాశ్రయానికి చంద్రు అనే వ్యక్తి కారులో అన్వర్‌సాదిక్, అయ్యప్పన్‌తో కలసి ఇయావుద్దీన్ సోమవారం రాత్రి బయల్దేరాడు. మంగళవారం ఉదయం పలవెలి ప్రాంతంలో టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు పక్కల కారు నిలిపి, చంద్రు, ఇయావుద్దీన్ కారు డిక్కీ నుంచి స్టెపినీ, జాకీ తీస్తున్న సమయంలో హఠాత్తుగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో చంద్రు, ఇయావుద్దీన్ తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. కారు నిలిపిన కారణంగా దానిపై ఉంచేందుకు చెట్టుకొమ్మలు తీసుకొచ్చేందుకు అయ్యప్పన్, అన్వర్‌సాదిక్ వెళ్లడంతో ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.100 కోట్ల భూ కబ్జా కేసు

● విచారణ ప్రారంభించిన సీబీసీఐడీ

అడయార్, జూన్ 18: నకిలీ పత్రాలతో రూ.100 కోట్ల విలువైన భూమిని కబ్జా చేసిన కేసులో సీబీసీఐడీ అధికారులు కరూర్ జిల్లాలో విచారణ ప్రారంభించారు. ఈ జిల్లాలోని మేలకరూర్ సబ్‌రిజిస్ట్రార్ మహ్మద్ అబ్దుల్‌ఖాదర్ కరూర్ నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అందులో కొందరు వ్యక్తులు నకిలీ దస్తావేజులు సమర్పించి 22 ఎకరాలను కబ్జాచేశారని, ఈ భూమి విలువ రూ.100 కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. అయితే, ఈ కబ్జా వెనుక అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్ హస్తం ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో కేసు విచారణను సీబీసీఐడీకి బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జీవాల్ ఆదేశాలు జారీచేశారు. దీంతో సీబీసీఐడీ అధికారులు రంగంలోకి దిగి విచారణ ప్రారంభించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 18: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు తెలిపింది.

ఎగ్మూర్: ఎగ్మూర్ హైరోడ్డు, గెంగురెడ్డి వీధి, వీరాస్వామి వీధి, పెరుమాళ్ రెడ్డి వీధి, క్లబ్ రోడ్డు, జగదమ్మాళ్ ఆలయ వీధి, ఎంఎస్ నగర్, చెట్‌పెట్ ప్రాంతం, టీసీఓ రోడ్డు, పూసాలై గెంగు రెడ్డి వీధి, హాల్స్ రోడ్డు, గాంధీ ఇర్విన్ రోడ్డు, కెన్నడీ లైన్, పాంథియన్ రోడ్డు, మాండియత్ రోడ్డు, ఎతిరాజ్ రోడ్డు, మార్షల్ రోడ్డు, మోతీలాల్ వీధి, పాత కమిషనర్ కార్యాలయం, న్యాయమూర్తుల క్వార్టర్స్, వెప్పేరి ప్రాంతం, నెహ్రూ పార్క్ హౌసింగ్ బోర్డు బీహెచ్ రోడ్డు.

పోరూర్: గెరుగంబాక్కం, పారిశ్రామిక వాడ, బాలాజి నగర్, జయరాం నగర్, పచ్చయమ్మన్ నగర్, భారతి నగర్, ఎంజీఆర్ నగర్, పెరుమాళ్ నగర్, లీలావతి నగర్, లక్ష్మీ నగర్, తిరుముడివాక్కం, 12వ మెయిన్ రోడ్డు, తిరుముడివాక్కం సిడ్కో, 13వ మెయిన్ రోడ్డు, అయ్యప్పన్‌తాంగల్, కాట్టుపాక్కం, అన్నై ఇందిరా నగర్, పుష్పా నగర్, విజయలక్ష్మి నగర్, పావేందర్ నగర్, రాందాస్ నగర్, లక్ష్మీ నగర్, ఇందిరా నగర్ ఒక భాగం, కోవూరు, కుండ్రత్తూర్ మెయిన్ రోడ్డు, వెస్ట్ మాడ వీధి, ఈస్ట్ మాడ వీధి, వెంకటేశ్వర నగర్, ధర్మరాజు ఆలయ వీధి, ఇందిరా నగర్, కోవూరు కాలని, అంబాల్‌నగర్, పట్టూరు, పట్టూరు బజార్ రోడ్డు, వాలాజీ వీధి, ఇసాక్ నగర్, ఆశిస్ వీధి, ఫాతిమా నగర్, ఇందిరా నగర్, గణపతి నగర్, న్యూ కామాక్షి నగర్, గోవిందరాజ్ వీధి, అన్నా వీధి, సౌత్ కామాక్షి వీధి, లీలావతి నగర్, ఆదం నగర్, పట్టూరు మెయిన్ రోడ్డు, కుళం, మనపాక్కం, మదానందపురం, ఆర్‌ఈ నగర్ 5 నుంచి 9 వీధులు, కృష్ణా నగర్, దురైస్వామి నగర్, రామకృష్ణా నగర్, అనెక్స్, కుండ్రత్తూర్ రోడ్డు ఒక భాగం, సిద్ధార్థ్ అపార్ట్‌మెంట్స్, వివేకానంద నగర్ ఒక భాగం, ఇమాచల్ నగర్, సంతోష్ నగర్, రాంజీ నగర్, ముత్తుమారియమ్మన్ నగర్, రామాపురం, మంగళానగర్, అంబాళ్ నగర్, పోరూర్ ఒక భాగం, మౌంట్ పూందమల్లి రోడ్డు ప్రాంతం, ఆర్‌ఈ నగర్ ఒక భాగం, వన్నియర్ వీధి, తిరువీధిఅమ్మన్ ఆలయ వీధి, పెరియార్ నగర్, కావనూర్, సిరుగళత్తూర్, సరస్వతి నగర్, కెళుత్తిపేట, నందంబాక్కం, అళగేశన్ నగర్, పెరియార్ నగర్, పెరియార్ నగర్ ఎక్స్‌టెన్షన్, అంబేద్కర్ నగర్, శాంతి నగర్, అంజుగం నగర్, రాజీవ్‌గాంధీ నగర్, భారతియార్ నగర్, దేవి కరుమారియమ్మ నగర్, తిరుముడివాక్కం, ముడిచ్చూర్, భరద్వాజ్ నగర్, ధనసెల్వి నగర్, పీటీసీ అపార్ట్‌మెంట్స్, వరదరాజపురం, రాయప్ప నగర్, దర్గాస్ రోడ్డు, నడువీరపట్టు, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు, తిరుఊరగ పెరుమాళ్ ఆలయ నగర్, పోలీస్ క్వార్టర్స్, శరణ్య నగర్, ఏఆర్ ఎడైమెంట్, శర్మ నగర్, వెంకటేశ్వర నగర్, సెంథిల్ నగర్, డైమండ్ వీధి, వెంకటేశ్వర నగర్, 1వ మెయిన్ రోడ్డు, పుత్తపేడు మెయిన్ రోడ్డు, మీనాక్షి నగర్, ఎస్ఎస్సీ బోస్ నగర్, తాంగల్ వీధి, ఎస్వీఎస్ నగర్

అడయార్: బిసెంట్ నగర్, వాల్మీకి నగర్, సరస్వతి నగర్, మొదటి బీచ్ వార్డు రోడ్డు, 3వ బీచ్ వార్డు రోడ్డు, బాలకృష్ణా రోడ్డు, జయరాం నగర్, కుప్పం బీచ్ రోడ్డు, రాజా శ్రీనివాస నగర్ మెయిన్ రోడ్డు, రాజగోపాల్ మెయిన్ రోడ్డు, టీచర్స్ కాలని 1 నుంచి 4 వీధులు, వేంబులిఅమ్మన్ ఆలయ వీధి, సీజీఈ కాలని, జయరాం వీధి, కొట్టివాక్కం, కొట్టివాక్కం కుప్పం రోడ్డు, తిరువళ్లువర్ నగర్ 7వ క్రాస్ వీధి నుంచి 33వ క్రాస్ వీధులు, తిరువళ్లువర్ నగర్ 1 నుంచి 6వ మెయిన్ రోడ్డు, 1 నుంచి 3వ అవెన్యూ వరకు, 12,40వ హౌసింగ్ బోర్డు క్వార్టర్స్ పర్షియన్ కాలేజ్, గాంధీ నగర్, సౌత్ లాక్ వీధి, చెల్లప్ప గార్డెన్, వెస్ట్ కాల్వాయ్ రోడ్డు, లాక్ వీధి, అంకాళమ్మన్ ఆలయ వీధి, మండపం రోడ్డు, పాండిచ్చేరి వీధి, వరదాపురం, ఎల్లయమ్మన్ ఆలయ వీధి, నాయుడు వీధి, తులుకానత్తమ్మన్ వీధి, కరుణానిధి 1,2 వీధులు, న్యూ వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి, రంగరాజపురం, కోట్టూరుపురం, రంగరాజపురం 1 నుంచి 6 వీధులు, శ్రీనగర్ కాలని, సౌత్ అవెన్యూ, నార్త్ మాడ వీధి, టెంపుల్ అవెన్యూ, ఈస్ట్ మాడ వీధి, రామ్ నగర్, రామ్ నగర్ 1 నుంచి 7 వీధులు, బైపాస్ మెయిన్ రోడ్డు, అక్షయం హోటల్ నుంచి మహేంద్ర షోరూం వరకు

పల్లావరం: రాధా నగర్, కడప్పేరి, జీఎస్‌టీ రోడ్డు, పార్వతి హాస్పిటల్, కట్లాంచావడి, నెహ్రూ నగర్, కడప్పేరి, న్యూ కాలని 15,16 వీధులు, జీహెచ్, బీఎస్ఎన్ఎల్, వెంకట్రామన్ నగర్, రాజకీల్పాక్కం, శివగామి నగర్, గాయత్రి నగర్, కృష్ణా నగర్, భాష్యం నగర్, పీవీఆర్ భువనేశ్వరి నగర్, తిరునీర్‌మలై మెయిన్ రోడ్డు, వేంబులిఅమ్మన్ ఆలయ వీధి, భజన ఆలయ వీధి, మల్లిమా వీధి, శివరాజ్ వీధి, ఒయిలిఅమ్మన్ ఆలయ వీధి, వైద్యకార వీధి, మేట్టు వీధి, జగజ్జీవన్‌రామ్ వీధి, రెట్టైమలై శ్రీనివాసన్ వీధి, తంగవేల్ వీధి

షోలింగనల్లూర్: మేడవాక్కం, పెరుంబాక్కం, నేశమణి నగర్, నూక్కంపాళయం మెయిన్ రోడ్డు, ఆర్సీ ప్లాజం, మల్లీస్, వరదాపురం, కాసా గ్రాండ్‌విల్లా, కోవిలంబాక్కం, పల్లికరనై, కామకోటి నగర్, వెస్ట్ అన్నానగర్, ఎస్.కొళత్తూర్, విడుదలై నగర్, 200 అడుగుల రేడియల్ రోడ్డు, వినాయకపురం, మహాకాళి అమ్మన్ ఆలయం, సిత్తలపాక్కం, టీఎన్‌హెచ్‌బీ కాలని, మనపాక్కం మెయిన్ రోడ్డు, వళ్లువర్ నగర్

తాంబరం: ఎంఐటీ, రాధా నగర్ మెయిన్ రోడ్డు, స్టేషన్ రోడ్డు, వీరభద్రన్ వీధి, రాజాజీ వీధి, సౌత్ వీధి, కామరాజ్ వీధి, కట్టబొమ్మన్ వీధి, కట్టబొమ్మన్ క్రాస్ వీధి, ఏలుమలై వీధి, వేలాయుధం వీధి, బాష్యం వీధి, భారతీయార్ వీధి, డాక్టర్స్ కాలని, హనుమాన్ ఆలయ వీధి, నాయుడు షాప్ రోడ్డు, కలైమగళ్ వీధి, జయలక్ష్మి వీధి, కామరాజ్ వీధి, గాంధీ నగర్, నెహ్రూ నగర్, రాధా నగర్, న్యూ కాలని, పాత హస్తినాపురం రోడ్డు, చందనకృష్ణ వీధి, శంకర్‌లాల్ జైన్ వీధి, ఆనంద నిలయం, అయ్యప్పస్వామి పాఠశాల రోడ్డు, అల్సాగ్రీన్ పార్క్, హోమ్ పెయింటర్, పాల్ విక్టర్ వీధి, రాజాజీ వీధి, పటేల్ వీధి, ఆర్పీ రోడ్డు, గంగైఅమ్మన్ ఆలయ వీధి, శ్రీరాం, స్టాండర్డ్, పెరుంగళత్తూర్, గాంధీ రోడ్డు, కట్టబొమ్మన్ వీధి, వీఓసీ వీధి, విజయలక్ష్మి వీధి, అన్నా వీధి, రాజీవ్‌గాంధీ వీధి, అంబేద్కర్ వీధి, దేవనేశన్ నగర్, ఏరికరై వీధి, వేల్ నగర్, శ్రీరామ్ నగర్, అన్నై థెరిస్సా వీధి, ఇమ్మానువేల్ వీధి, రాజాజీ నగర్, సెంబాక్కం, తిరువళ్లువర్ వీధి, గాంధీ వీధి, గణపతి వీధి, అన్నా నగర్, చోళన్ నగర్, సుదర్శన్ నగర్, మాడంబాక్కం మెయిన్ రోడ్డు, అరవింద నగర్, కరుమారియమ్మన్ ఆలయ వీధి, శ్రీదేవి నగర్, గాయత్రి గార్డెన్, మిల్లాడి గార్డెన్, కుమారస్వామి వీధి, అంబిగై నగర్, సుదర్శన్ నగర్

గిండి: రామపురం, శుభశ్రీ నగర్, వీవీ ఆలయ వీధి, ఏజీఎస్ కాలని, అన్నై వేలాంకన్ని నగర్, సెల్వలక్ష్మి గార్డెన్, బృందావన్ నగర్, ఏజీఆర్ గార్డెన్, ఆర్సీఎల్ పూర్తి ప్రాంతం, గణేష్ బిల్డర్స్, రామ్ నగర్, మడిపాక్కం, లక్ష్మినగర్, కుబేరన్ నగర్ 10, 12వ వీధులు, రామ్ నగర్, 17వ సౌత్ వీధి, కన్నన్ నగర్, నంగనల్లూర్, మేడవాక్కం మెయిన్ రోడ్డు, విఘ్నేశ్వర నగర్, బాలాజి నగర్, పెరుమాళ్ నగర్, మూవరసంపేట కొంత భాగం, రాఘవ నగర్ కొంత భాగం, సోలయప్పన్ నగర్, ముత్తుమారియమ్మన్ నగర్

కేకే నగర్: విరుగంబాక్కం, ఇళంగో నగర్ సౌత్ వీధి, వాయుపుత్ర వీధి, బాలాంబాల్ వీధి, తంగల్ వీధి, రెడ్డి వీధి, కృష్ణా నగర్, ఏవీఎం కాలని, యాదవ వీధి, స్కూల్ వీధి

వ్యాసర్పాడి: కనకసత్రం, మాధవరం లెథర్ ఎస్టేట్, పొన్నియమ్మన్‌మేడు, పునీత అన్నీస్ స్కూల్, కాలేజ్ ప్రాంతం, జీఎస్‌టీ రోడ్డు, తట్టాన్‌కుళం రోడ్డు, పెద్ద రోడ్డు ప్రాంతం, కనకసత్రం మెయిన్ రోడ్డు

ఆవడి: తిరుముల్లైవాయల్, అలమాది, కొడువెలి, మాకరల్ కండిగై, సేత్తుపాక్కం, గురువాయల్, కారణి, అమ్మనపాక్కం, రామాపురం

అంబత్తూర్: ఈస్ట్ మొగప్పేర్, కుమరన్ నగర్, మహాత్మాగాంధీ రోడ్డు, కలైవానర్ నగర్, దేవర్ నగర్, శక్తి నగర్, జేజే నగర్, నొలంబూర్, 1,6 మెయిన్ రోడ్డు, దువాగర అపార్ట్‌మెంట్, లేక్ స్కీమ్, 10వ వీధి, వీజీఎన్ ఫేస్-2, శ్రీస్టార్ అపార్ట్‌మెంట్, జీజీ నగర్, గోల్డన్ జార్జి నగర్, అంబేద్కర్ నగర్, 9వ మెయిన్ రోడ్డు, మొగప్పేర్ ఏరి తిట్టం, 8వ వీధి, తిరువళ్లువర్ రోడ్డు, గార్డెన్ అవెన్యూ, తిరువళ్లువర్ నగర్, మగిలిచ్చి కాలని, స్పార్టన్ స్కూల్, టీపీవీ మహిళ స్కూల్ మరియు చుట్టుపక్కల ప్రాంతాలు.

‘తంగలాన్’ నుంచి న్యూ పిక్

● సోషల్ మీడియాలో వైరల్

చియాన్ విక్రమ్ తాజాగా నటిస్తున్న చిత్రం ‘తంగలాన్’. కోలార్ గోల్డ్ ఫ్యాక్టరీ (కేజీఎఫ్) పని చేసిన తమిళ కూలీల ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు పా.రంజిత్. మాళవిక మోహనన్, పార్వతి హీరోయిన్లు. ప్రతి నాయకుడిగా పశుపతి నటించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని ఈ యేడాది జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు. అయితే, పోస్ట్ ప్రొడక్షన్, గ్రాఫిక్స్ పనులు పూర్తి కాక పోవడంతో చిత్రం విడుదలను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ మూవీ నుంచి విక్రమ్ కొత్త లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేయగా అది వైరల్‌గా మారింది. స్టూడియో గ్రీన్ పతాకంపై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో భారీ బడ్జెట్‌తో నిర్మించారు.కాగా, ఈ మూవీని ఇప్పటికే పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శించగా అనేక అవార్డులు, రివార్డులు అందుకుంది. మూవీ క్రిటిక్స్ నుంచి ప్రశంసలు దక్కించుకుంది. ఆగస్టులో విడుదలయ్యే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.


‘తంగలాన్’లో విక్రమ్

మరోమారు దెయ్యాన్ని నమ్ముకున్న సుందర్ సి

ప్రముఖ దర్శక నటుడు సుందర్ సి మరోమారు దెయ్యాన్ని నమ్ముకున్నారు. దెయ్యం స్టోరీతో ‘అరణ్మనై’ సిరీస్ పేరుతో ఇప్పటివరకు ఆయన తీసిన నాలుగు చిత్రాలు మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు కలెక్షన్ల వర్షం కురిపించాయి. ఈ నేపథ్యంలో మరోమారు దెయ్యం స్టోరీతోనే కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో సీనియర్ హాస్య నటుడు వడివేలుకు ముఖ్య పాత్రను పోషించనున్నట్టు తెలుస్తోంది. గతంలో సుందర్ సి, వడివేలు కాంబినేషన్‌లో వచ్చిన ‘తలైనగరం’, ‘విన్నర్’ వంటి చిత్రాలు సూపర్ హిట్ అయ్యాయి. ఈ చిత్రాల్లో వడివేలు కామెడీకి ప్రేక్షకులు కడుపుబ్బ నవ్వారు. ఇపుడు మళ్లీ వీరిద్దరు కలిసి ఒక ప్రాజెక్టు చేయనున్నట్టు వార్తలు వస్తున్నాయి. గతంలో సుందర్ సి తెరకెక్కించి రెండు భాగాలుగా వచ్చిన ‘కలగలప్పు’ చిత్రం మూడో భాగాన్ని తెరకెక్కించేందుకు ప్లాన్ చేసినట్టు సమాచారం. ఇందులో మొదటి రెండు భాగాల్లో ఉన్న నటులు విమల్, శివ కూడా నటించనున్నట్టు వార్తలు వస్తున్నాయి. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.


సుందర్ సి - వడివేలు

చిత్రజ్యోతి

చీరను ఇలా కూడా కట్టొచ్చంటున్న రాశీఖన్నా

సుందర్ సి దర్శకత్వంలో వచ్చిన ‘అరణ్మనై-4’ విజయంతో మంచి ఊపుమీదున్న హీరోయిన్ రాశీ ఖన్నా... ఇటీవల గ్లామర్ డోస్‌ను పెంచారు. తాజాగా చీర కట్టులో ఆమె ఎక్స్‌పోజింగ్ చేస్తూ... చీరను ఇలా కూడా కట్టొచ్చంటూ స్పెషల్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ ఫొటోల కింద... ‘ఇక్కడ నా పేరు కంటే నా ముఖమే ఎక్కువగా కనిపిస్తుంది. ఈ యేడాది ‘పాపులర్ ఫేస్’ అవార్డును ప్రదానం చేసిన ఓ మీడియా సంస్థకు ధన్యవాదాలు’ అని ట్వీట్ చేశారు. 2018లో తమిళంలోకి ఎంట్రీ ఇచ్చిన రాశీఖన్నా... ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించారు. కేవలం సినిమాల్లోనే కాకుండా సోషల్ మీడియాలోనూ గ్లామర్ ఫొటోలను షేర్ చేస్తుంటారు.ఆ కోవలోనే ఇపుడు చీర కట్టులో తీసిన ఫొటోలను షేర్ చేశారు.



విజయ్ పార్టీలో చేరనున్న ఆ ఇద్దరు నటులు?


రాఘవ లారెన్స్ - కేపీవై బాలా

వివిధ రూపాల్లో తమకు స్థాయికి తగినట్టుగా సాయం చేస్తున్న నటులు రాఘవ లారెన్స్, కేపీవై బాలా అగ్ర హీరో విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. తమిళ చిత్రపరిశ్రమలో తమ సంపాదనలో వీరిద్దరూ వేర్వేరుగా అనేక మందికి తమ వంతు సాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లారెన్స్ అడుగు ముందుకేసి ‘మాట్రం’ పేరుతో ట్రస్ట్‌ను స్థాపించారు. ఈ ట్రస్ట్ ద్వారా పలువురు రైతులకు ట్రాక్టర్లను ఉచితంగా అందించారు. అలాగే, కేపీవై బాలా తాను సంపాదించే మొత్తంలో తన ఖర్చులకు ఉంచుకుని మిగిలిన మొత్తాన్ని ప్రజాసేవకు ఖర్చు చేస్తున్నారు. ఆ కోవలో ఓ గ్రామానికి అంబులెన్స్‌ను, మరో మహిళకు ఆటోను కొనిచ్చారు. ఈ నేపథ్యంలో హీరో విజయ్ కూడా తనవంతుగా సాయం చేస్తున్నారు. ఆయన తమిళగ వెట్రి కళగం పేరుతో ఒక రాజకీయ పార్టీని స్థాపించి, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఈ పరిస్థితుల్లో రాఘవ లారెన్స్, కేపీవై బాలాలు ఇపుడు విజయ్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ విషయంపై టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ వారిద్దరితో సంప్రదింపులు జరుపుతున్నట్టు వార్తలు వస్తున్నాయి.


చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల నడుమ కుల, మత ద్వేషాలను నిరోధించే దిశగా చేపట్టాల్సిన చర్యలపై రూపొందించిన నివేదికను సమర్పిస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రూ

కరుణానిధి విరచిత ‘రామానుజర్’ గ్రంథావిష్కరణ

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చెన్నై సచివాలయంలో మంగళవారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి రచించిన ‘రామానుజర్’ గ్రంథాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆవిష్కరించారు. ఓ తమిళ టీవీ ఛానెల్‌లో శ్రీమద్ రామానుజులవారి జీవిత విశేషాలతో ‘రామానుజర్-మదత్తిల్ పురట్చి సెయిద మహాన్’ (శ్రీరామానుజులు- మతంలో మహోన్నత ఉద్యమం జరిపిన మహాపురుషుడు) పేరుతో ఆధ్యాత్మిక సీరియల్ ప్రసారమైంది. ఆ సీరియల్‌కు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సంభాషణలు, కథాగమనం సమకూర్చారు. 433 ఎపిసోడ్స్‌తో ప్రసారమైన ఆ ఆధ్యాత్మిక సీరియల్‌కు ప్రేక్షకుల నుండి అపూర్వ స్పందన లభించింది. ఆ తమిళ సీరియల్‌ను ప్రముఖ నటి కుట్టి పద్మిని నిర్మించారు. ఈ నేపథ్యంలో టీవీ ఛానెల్‌లో ప్రసారమైన ఆ సీరియల్ సంభాషణలతో, కథాగమనంతో దేవాదాయ శాఖ గ్రంథాన్ని ముద్రించింది. ఈ గ్రంథాన్ని స్టాలిన్ ఆవిష్కరించి, తొలి ప్రతిని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త సుకి శివంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్ బాబు, ఆళ్వార్‌తిరునగరి ఎంపెరుమనార్ జీయర్ మఠం శ్రీమద్ పరమహంసోత్యాది రంగరామానుజ జీయర్ స్వామి, శ్రీపెరుంబుదూరు శ్రీ ఎంబార్ జీయర్ మఠం అప్పన్ ఉలగారియ రామానుజ ఎంబార్ జీయర్ స్వామి, శ్రీవిల్లిపుత్తూరు శ్రీమనవాళ మామునుల జీయర్ మఠం శటలగోప రామానుజ జీయర్ స్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, పర్యాటక, దేవాదాయ శాఖల అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ మణివాసన్, దేవాదాయ శాఖ ప్రత్యేక పనుల అధికారి జే కుమారగురుబరన్, కమిషనర్ కేవీ మురళీధరన్, ప్రముఖ నటి కుట్టి పద్మిని తదితరులు పాల్గొన్నారు.


సచివాలయంలో శ్రీరామానుజర్ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

నాదముని వద్ద మెట్రో ‘ర్యాంప్’ పనులు


రాంప్ ఏర్పాటుచేస్తున్న దృశ్యం

ఐసిఎఫ్, జూన్ 18: స్థానిక విల్లివాక్కం సమీపంలోని నాదముని ప్రాంతంలో మెట్రో ‘ర్యాంప్’ పనులు ప్రారంభమయ్యాయి. నగరంలో రెండవ విడతలో మూడు మార్గాల్లో ఉన్న షోలింగనల్లూర్ - మాధవరం మధ్య ఫ్లై ఓవర్ రైల్వేస్టేషన్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, కొళత్తూర్ - నాదముని మధ్య ఏర్పాటు కానున్న మెట్రో సొరంగ మార్గానికి స్థలసేకరణ పనుల్లో జాప్యం జరిగింది. ప్రస్తుతం సమస్యలు పరిష్కారం కావడంతో సొరంగమార్గం, ఫ్లై ఓవర్ అనుసంధానం చేసేలా ర్యాంప్ అనే భారీ ఫ్లోర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ విషయమై సీఎంఆర్‌ఎల్ అధికారులు మాట్లాడుతూ... మాధవరం - షోలింగనల్లూర్ మార్గంలో 44.6 కి.మీ దూరం పలు రైల్వేస్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మార్గంలో కొళత్తూర్ - నాదముని మధ్య 5 కి.మీ దూరం సొరంగ మార్గం ప్రారంభ దశ పనులు చేపట్టామని, త్వరలో సొరంగం తవ్వకాలు చేపడతామని తెలిపారు. అలాగే, నాదముని ప్రాంతంలో ర్యాంప్ పనులు ప్రారంభమయ్యాయని, 2026లో ఈ మార్గంలో మెట్రో సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు.

వెటర్న్స్ ప్రీమియర్ లీగ్ సీజన్-3 ప్రారంభం


వీపీఎల్ సీజన్-3 ప్రారంభోత్సవ దృశ్యం

అడయార్, జూన్ 18: వెటర్న్స్ ప్రీమియర్ లీగ్ (వీపీఎల్) మూడో సీజన్ ప్రారంభమైంది. 35 యేళ్ళ అంతకంటే ఎక్కువ వయస్సు క్రికెటర్లతో ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. ఇందులో అనేక మంది అనుభవజ్ఞులైన క్రికెటర్లకు చోటుకల్పించారు. వీపీఎల్ సీజన్-3ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని టోర్నీ నిర్వాహకులు వెల్లడించారు. ఔత్సాహిక యువ క్రికెటర్లను గుర్తించి, వారిలోని నైపుణ్యం, ప్రతిభకు సానబెట్టి మంచి క్రికెటర్లుగా తీర్చిదిద్దే ప్రక్రియకు వీపీఎల్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇందులో మొత్తం 12 జట్లకు చెందిన 190 మంది క్రీడాకారులు పాలు పంచుకుంటున్నారు. ఈ టోర్నీలో మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేలు ప్రదానం చేస్తామని వారు విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సీజన్‌కు సంబంధించి జట్ల జెర్సీని ఆవిష్కరించారు.

ఎమిరేట్స్ విమానానికి బాంబు బెదిరింపు

● 12 గంటలు ఆలస్యం

అడయార్, జూన్ 18: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్‌కు వెళ్లాల్సిన ఎమిరేట్స్ సంస్థకు చెందిన విమానానికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. దీంతో ఈ విమానం 12 గంటలు ఆలస్యంగా బయలుదేరి వెళ్ళింది. ఈకే 543 అనే ఎమిరేట్స్ విమానం చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి 250 మంది ప్రయాణికులతో మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు బయలుదేరి వెళ్ళాల్సి ఉంది. అయితే, సోమవారం రాత్రి చెన్నై నగరంలో భారీ వర్షం కురిసింది. ఈ కారణంగా విమానం ఉదయం 10.30 గంటలకు బయలుదేరి వెళుతుందని ప్రకటించారు. దీంతో ప్రయాణికులను సమీపంలోని హోటళ్లకు తరలించారు. అయితే, ఈ విమానంలో బాంబు పెట్టినట్టు టర్కీ రాజధాని ఇస్తాంబుల్ నుంచి ఈమెయిల్ వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన బాంబు స్క్వాడ్ విమానం మొత్తం ముమ్మరంగా తనిఖీలు చేసి, ఈ బెదిరింపు ఉత్తుత్తిదేనని తేల్చింది. ఈ విమానం 12 గంటల ఆలస్యంగా మంగళవారం రాత్రి బయలుదేరి వెళ్లింది.

టీడీపీ విజయంపై ట్రిప్లికేన్‌లో సంబరాలు


సంబరాల్లో పాల్గొన్న కుంకు దశరథరావు, ఏనుగంటి వెంకట్ తదితరులు

ప్యారీస్, జూన్ 18: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు పదవీ బాధ్యతలు స్వీకరించడాన్ని ఆహ్వానిస్తూ స్థానిక ట్రిప్లికేన్‌లో నివసిస్తున్న తెలుగు వారు సంబరాలు జరుపుకున్నారు. ట్రిప్లికేన్ తెలుగు ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఐస్‌హౌస్‌లో ప్రసిద్ధి చెందిన ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం సాయంత్రం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సహా మంత్రివర్గంలో ఉన్న వారు, టీడీపీ నాయకులు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరుల కోసం అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం 12 కిలోల కేక్ కటింగ్ వేడుకల్లో కుంకు దశరథరావు, టీడీపీ ఫోరం నేత ఏనుగంటి వెంకట్, కొంపల్లి బోస్, వై.నాగయ్య, కె.దాసయ్య, కె.పెంచలయ్య, కుందూరు నాగేశ్వరరావు, కొమ్మి బాలయ్య, క్రాంతి శ్రీనివాసులు, పి.తిరుపాల్, ఎం.లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొని ‘జై చంద్రబాబు’ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఆ ప్రాంతంలో బాణసంచా కాల్చి, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసి సందడి చేశారు.

నల్లగా మారిన సముద్రం


పాత సాతాన్‌కుప్పంలో నల్లగా మారిన తీరం

ఐసిఎఫ్, జూన్ 18: తిరువళ్లూర్ జిల్లా పళవేర్కాడు సముద్రతీరం నల్లగా మారడంతో జాలర్లు భయాందోళన చెందారు. పళవేర్కాడులో 35 మత్స్య గ్రామాలున్నాయి. తిరుమలై నగర్ నుంచి కాట్టుపల్లి వరకు 13 కి.మీ దూరం సముద్రతీరం ఉంది. ఈ నేపథ్యంలో, పాత సాతాన్‌కుప్పం, కోరైకుప్పం, వైరవన్ కుప్పం వంటి మత్స్యగ్రామ తీర ప్రాంతాల్లో అలలకు కొట్టుకొచ్చే ఇసుక నల్లరంగుతో ఉంది. సముద్రపు అలలు, ఒండ్రు మట్టి కలసి బురద రూపంలో తీరానికి కొట్టుకొస్తున్నాయి. 2018 జనవరి, గత ఏడాది డిసెంబరులో ఎన్నూర్ హార్బర్‌కు వచ్చిన నౌకల నుంచి విడుదలైన ముడిచమురుతో కొన్ని నెలలపాటు జాలర్లు చేపలు పట్టేందుకు వెళ్లలేదు. ప్రస్తుతం సముద్రతీరం నల్లగా మారడంతో పర్యావరణ మార్పులు చోటుచేసుకున్నాయని భయాందోళనలకు గురవుతున్నారు.


క్లినిక్ ప్రారంభిస్తున్న శక్తి అమ్మ

తోటపాళ్యంలో శ్రీ శక్తి అమ్మ క్లినిక్ ప్రారంభం

వేలూరు, జూన్ 18: స్థానిక తోటపాళ్యంలో శ్రీ శక్తి అమ్మ క్లినిక్ మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శక్తి అమ్మ పాల్గొని జ్యోతి వెలిగించి క్లినిక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ బాలాజి, జాయింట్ డైరెక్టర్లు శ్రీనాథ్ బాలాజి, శ్రీకాంత్ బాలాజి, ఉప సూపరింటెండెంట్ శక్తివేలు, ఆసుపత్రి సిబ్బంది, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా 38వ సామూహిక ఉపనయనం

వేలూరు, జూన్ 18: స్థానిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో 38వ సామూహిక ఉపనయనం నిర్వహించారు. సత్తువాచేరిలోని శ్రీ భువనేశ్వరి మహల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాఘవ్, అశ్విన్, రూపేష్, విష్ణు, తిరువణ్ణామలైకు చెందిన యువరామ్, కాంచీపురానికి చెందిన సంతోష్ తదితరులకు జంధ్యా ధారణగావించారు. కార్యక్రమంలో సంఘ ఆధ్యాత్మిక అడ్వయిజర్ అత్తిమలైపట్టు శ్రీమాన్ గణేశ శాస్త్రి నేతృత్వం వహించారు. అనంతరం సంఘం కార్యకర్తల సమావేశం జరిగింది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజ, ఉపాధ్యక్షుడు ఉమాపతి శివమ్, నిర్వాహకులు రాజగోపాల్, చంద్రశేఖర్, అనుసమ్ గోపాలకృష్ణన్, సెక్రటరీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సామూహిక ఉపనయనంలో నిర్వాహకులు


చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఆస్ట్రేలియా రాయబారి శిలాయ్ జాకీ తదితరులు


చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నుండి పద్మశ్రీ అవార్డును అందుకున్న స్క్వాష్ క్రీడాకారిణి,రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి పంపిణీ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జోష్నా చిన్నప్ప తదితరులు